
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 29 మార్చి 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.34 గం.
సహర్ : శనివారం ఉ : 4.50 గం.



ముగ్గురు ముగ్గురే..

మెదక్ పార్లమెంటులో పోరు ఆసక్తికరం



- ఖరారైన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ఇప్పటికే ప్రజాక్షేత్రంలోకి బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు
- నీలం మధుకే కాంగ్రెస్ టికెట్
- ప్రచారమే లక్ష్యంగా ఎవరి వ్యూహాలు వారివే



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి28 : ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడంతో మెదక్ పార్లమెంటు ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు, బీఆర్ఎస్ తరఫున మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామా రెడ్డి పేర్లు ఖరారయ్యాయి. తాజాగా నీలం మధుకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ప్రకటించింది. దీంతో ప్రచారమే లక్ష్యంగా ఎవరి వ్యూహాల్లో వారు నిమగ్నమయ్యారు. రఘునందన్ రావు, వెంకట్రామారెడ్డి సన్నాహక సమావేశాలు, కార్యకర్తల సభలు, విభిన్నవర్గాలతో ముఖాముఖి కార్యక్రమాలు చేపడుతున్నారు. నీలం మధు సైతం గురువారం రంగంలోకి దిగారు. పలువురు కాంగ్రెస్ నేతలను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

రెండోసారి రఘునందన్ పోటీ

మెదక్ బీజేపీ అభ్యర్థిగా మాధవనేని రఘునందన్‌రావు రెండోసారి బరిలోకి దిగుతున్నారు. 2019 ఎన్నికల్లో పోటీచేసిన ఆయనకు 2,01,567 ఓట్లు పోలయ్యాయి. ఆనాడు మూడోస్థానంలో నిలిచారు. తర్వాత జరిగిన దుబ్బాక ఉప ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీచేసి విజయం సాధించారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో మళ్లీ ఓటమి ఎదురైంది. ఈ క్రమంలో మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా మరోసారి అవకాశం ఇప్పించాలని అధిష్ఠానాన్ని కోరారు. స్థానిక సమీకరణాల దృష్ట్యా రఘునందన్ వైపే పార్టీ మొగ్గు చూపింది. తన అభ్యర్థిత్వం ఖరారైన మరుక్షణం నుంచే తన వ్యూహాలకు పదును పెట్టారు. బూత్ కమిటీల వారీగా సమావేశాలు నిర్వహించారు. విభిన్న వర్గాలతోనూ ముఖాముఖి చర్చలు జరిపారు. గ్రామాల్లో పర్యటిస్తున్నారు. మెదక్‌లో రెండోసారి పోటీ చేయడం రఘునందన్‌కు అనుభవపరంగా కలిసొచ్చే అంశం. ఓడిన సానుభూతి, బీజేపీ ఓటు బ్యాంకు, మోదీ చరిష్మాతో పాటు ఇతరాత్ర అంశాలు తన విజయానికి దోహదం చేస్తాయని ఆశిస్తున్నారు.

ఇందిర నియోజకవర్గం

తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో మెదక్ స్థానానికి ప్రత్యేకత ఉంది. ఇదే లోక్‌సభ నుంచి 1980లో మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ పోటీచేసి గెలుపొందారు. దీంతో మెదక్ పేరు ఆనాడు దేశంలోనే మార్మోగింది. ఇందిరా నియోజకవర్గంగా గుర్తింపు దక్కింది. ఆ తర్వాత టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు వరుసగా ప్రాతినిధ్యం వహించారు. ఇక 2004 నుంచి 2019 పార్లమెంటు ఎన్నికల వరకు బీఆర్ఎస్ హవా కొనసాగింది. పదేళ్ల ఉద్యమం, మరో పదేళ్ల అధికార పర్వంలో ఈ స్థానాన్ని బీఆర్ఎస్ నిలబెట్టుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, కేంద్రంలో బీజేపీ ధీమాగా ఉండడంతో ఇక్కడి పోటీ రసవత్తరంగా మారనున్నది.

వార్డు మెంబర్ టు ఎంపీ అభ్యర్థిగా..

పటాన్‌చెరు మండలం చిట్కూల్ గ్రామంలో వార్డు సభ్యుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన నీలం మధును కాంగ్రెస్ పార్టీ మెదక్ అభ్యర్థిగా బరిలో నిలిపింది. 2006లో వార్డు సభ్యుడిగా, 2014లో ఉప సర్పంచ్‌గా, 2019లో చిట్కుల్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2014లో బీఆర్ఎస్ నుంచి పటాన్‌చెరు జడ్పీటీసీ సభ్యుడిగా పోటీ చేసి ఓడిపోయారు. 2023లో పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్ ఆశించిన మధుకు భంగపాటు ఎదురవ్వడంతో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లోనూ టికెట్ దక్కకపోవడంతో ఆ వెంటనే బీఎస్పీలో చేరి ఎమ్మెల్యేగా పోటీచేసి పరాజయం చవిచూశారు. తాజాగా మళ్లీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మధుకు కీలకమైన పార్లమెంటు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ముదిరాజ్ సామాజికవర్గంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు, ఆ పార్టీ సంక్షేమ పథకాల లబ్ధిదారుల మద్దతు దక్కుతుందనే ధీమాతో ఉన్నారు.

మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో విజేతలు

సంవత్సరం	ఎంపీ	పార్టీ
1952	ఎస్.ఎం జయసూర్య	పీడీఎఫ్
1957	పి.హన్మంతరావు	కాంగ్రెస్
1962	పి.హన్మంతరావు	కాంగ్రెస్
1967	సంగం లక్ష్మీబాయి	కాంగ్రెస్
1971	మల్లిఖార్జున్ గౌడ్	టీపీఎస్
1977	మల్లిఖార్జున్ గౌడ్	కాంగ్రెస్
1980	ఇందిరాగాంధీ	కాంగ్రెస్
1984	పి.మాణిక్ రెడ్డి	టీడీపీ
1989	ఎం.బాగారెడ్డి	కాంగ్రెస్
1991	ఎం.బాగారెడ్డి	కాంగ్రెస్
1996	ఎం.బాగారెడ్డి	కాంగ్రెస్
1998	ఎం.బాగారెడ్డి	కాంగ్రెస్
1999	ఆలె నరేంద్ర	బీజేపీ
2004	ఆలె నరేంద్ర	టీఆర్ఎస్
2009	విజయశాంతి	టీఆర్ఎస్
2014	కేసీఆర్	టీఆర్ఎస్
2014 (ఉ/ఎ)	కొత్త ప్రభాకర్‌రెడ్డి	టీఆర్ఎస్
2019	కొత్త ప్రభాకర్‌రెడ్డి	టీఆర్ఎస్

వ్యూహాత్మకంగానే వెంకట్రామారెడ్డి

మెదక్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. నెల క్రితమే మాజీ కలెక్టర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి పేరును ఆ పార్టీ తెరమీదకు తెచ్చింది. ఆయనకే టికెట్ ఖరారు చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత వెంకట్రామారెడ్డి పేరు కనుమరుగై మరికొందరి పేర్లు చర్చకొచ్చాయి. అయితే ఈ పేర్లన్నింటిపై కార్యకర్తలు, ముఖ్యనేతలతోపాటు ప్రజల్లోనూ అభిప్రాయ సేకరణ చేసినట్లు తెలిసింది. దీంతో వెంకట్రామారెడ్డి వైపే మొగ్గు కనిపించడంతో మళ్లీ ఆయనను ఫైనల్ చేశారు. సిద్దిపేట కలెక్టర్‌గా, ఉమ్మడి మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, డ్వామా పీడీగా సుదీర్ఘకాలం పనిచేసిన వెంకట్రామారెడ్డి పరిచయం అక్కర్లేని వ్యక్తి కావడంతో ఆయన్నే బరిలో దింపారు. దీనికితోడు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలుంటే ఆరింట్లోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉండడం కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. అదే విధంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఈ స్థానంపై ప్రత్యేక దృష్టి సారించారు.

ముగ్గురికీ పటాన్‌చెరు నేపథ్యం..

మెదక్ పార్లమెంటు పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇందులో పటాన్‌చెరు సైతం ఒకటి. కాగా ప్రస్తుతం ప్రధాన పార్టీల తరఫున బరిలో నిలిచిన ముగ్గురు అభ్యర్థులకూ పటాన్‌చెరు నియోజకవర్గ నేపథ్యం ఉండడం ఆసక్తికరంగా మారింది. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఇదే పటాన్‌చెరులో జర్నలిస్టుగా, న్యాయవాదిగా పనిచేయడంతోపాటు జడ్పీటీసీగా పోటీ చేశారు. తన రాజకీయ ప్రస్థానం ఇక్కడి నుండే ప్రారంభమైంది. తర్వాత తన స్వస్థలమైన దుబ్బాక వేదికగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఇదే పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ సర్పంచ్‌గా ఇటీవలి వరకు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగానూ పటాన్‌చెరులో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి సైతం పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఆర్సీపురం మండలం తెల్లాపూర్‌లోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. తన కుటుంబానికి సంబంధించిన ఓట్లన్నీ ఇదే నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ముగ్గురికి కూడా పటాన్‌చెరు ప్రాంతంతో సంబంధాలు నెలకొన్నాయి. అంతేగాకుండా జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న గాలి అనిల్‌కుమార్ కూడా పటాన్‌చెరు నివాసి కావడం గమనార్హం.

యువతే కీలకం

39 ఏళ్ల లోపు ఓటర్లు 9,52,583 మంది

- అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించేది వారే
- మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలో ఓటరు నమోదుకు స్పందన

మెదక్, మార్చి 27: మెదక్ లోకసభ నియోజకవర్గ పరిధిలో గెలుపు ఓటములను నిర్ణయించడంలో యువ ఓటర్లు, మహిళలు కీలకం కానున్నారు. వారు ఎటు వైపు మొగ్గు చూపితే వారే విజేతలుగా నిలిచే అవకాశం ఉంది. నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంటలో మొత్తం ఓటర్లు 18,19,397 మంది కాగా.. వీరిలో 39 ఏళ్ల లోపు వయసు వారు 9,52,583 మంది ఉండడం విశేషం. ఈసారి భారీగా కొత్త ఓటర్లు నమోదు చేసుకున్నారు. 18-19 ఏళ్ల వయసు వారు 53,458 మంది కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. కళాశాలల్లో విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించడంతో పాటు ఇతర వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయడంతో సత్ఫలితాలను ఇచ్చింది. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు గడువు ఇచ్చింది. ఈలోపు యువ ఓటర్ల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముంది.

మహిళలూ నిర్ణయాత్మకమే..

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లు నిర్ణయాత్మక ప్రాత్ర పోషించనున్నారు. మెదక్ లోక్‌సభ నిమోజకవర్గ పరిధిలో 9,21,400 మంది మహిళా ఓటర్లున్నారు. ఇందులో 39 ఏళ్ల లోపు వారు 4,73,463 మంది ఉన్నారు. ఎంపీ అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించడంలో మహిళా ఓటర్లు కీలకం కానున్నారు.

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వివిధ వయసుల ఓటర్లు

వయసు	పురుషులు	మహిళలు	మొత్తం
18-19	30,315	23,132	53,458
20-29	2,01,444	1,94,676	3,96,228
30-39	2,47,176	2,55,655	5,02,897
40-49	1,91,954	1,95,332	3,87,303
50-59	1,17,696	1,25,800	2,43,498
60-69	69,246	76,605	1,45,855
70-79	32,952	39,383	72,336
80-89	6,284	9,356	15,640
90-99	680	1,389	2,069
100-119	40	69	109
120 పైన	1	2	3
మొత్తం	8,97,788	9,21,400	18,19,397

బస్సుల్లో నగలు కాజేసే
పార్థీ గ్యాంగ్ అరెస్ట్
- 12.5 తులాల బంగారం రికవరీ
- ఐదుగురు సహా కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

7లో

బ్రహ్మోత్సవ శోభ
ముస్తాబయిన బొంతపల్లి వీరభద్ర ఆలయం

7లో



ఇఫ్తార్ విందులో మంత్రి దామోదర్

జోగిపేటలోని ఖదీమ్ జామియా మసీదులో గురువారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్షలను విరమింపజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.
-జోగిపేట, మార్చి 27

నింద మోయాల్సి వస్తుందేమోనని..

ట్రాక్టర్ ప్రమాదంలో ముగ్గురి మృతితో పెళ్లి కుమారుడి తాత ఆందోళన.. ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య

- పెళ్లి జరగాల్సిన రోజే నలుగురి అంత్యక్రియలు



సొంగ పెంటయ్య

పాపన్నపేట, మార్చి 28: బంధుమిత్రుల సంబురాల మధ్య వేడుకగా పెళ్లి జరగాల్సిన ఆ ఇంట మరో విషాదం నెలకొంది. మెదక్ జిల్లా అందోల్ మండలం మన్సాన్‌పల్లి వద్ద బుధవారం పెళ్లి బృందంతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తాపడటం.. ఆ ప్రమాదంలో వరుడి తరఫువారు ముగ్గురు మృత్యువాతపడిన ఘటన జరిగిన మర్నాడే ఆ ఇంట మరో దిగ్భ్రాంతికరమైన ఘటన జరిగింది. ట్రాక్టర్ ప్రమాద ఘటనతో వరుడి తాత తీవ్ర ఆవేదన చెందాడు. మనుమడి పెళ్లి ఆగిపోవడం.. మృతిచెందిన ముగ్గురూ పాలోళ్లే కావడంతో తాను బతికి ఉన్నంత కాలం ఆ నింద మోయాల్సి వస్తుందేమోనని తీవ్ర ఆందోళన చెందాడు. ప్రమాదం జరిగిన మర్నాడు తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాచారం గ్రామంలో వరుడి ఇంట విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన సొంగ రమేశ్‌కు సంగారెడ్డి జిల్లా అందోల్‌కు చెందిన అమ్మాయితో పెళ్లి కుదరింది. గురువారం పెళ్లి కోసం బుధవారం వరుడి కుటుంబసభ్యులు, బంధువులు ట్రాక్టర్‌లో బాచారం నుంచి బయలుదేరారు. అందోల్ మండలం మన్సాన్‌పల్లి ట్రాక్టర్ వద్ద బోల్తా పడింది. ఈ ఘటనలో పెళ్లి కుమారుడి పాలోళ్లు ముగ్గురు మృతిచెందారు. ఈ ఘటనతో పెళ్లి ఆగిపోయింది. కుటుంబం మొత్తం విషాదంలో మునిగి ఉండగా, వరుడి తాత సొంగ పెంటయ్య (68) గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకున్నాడు. 12 గంటల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందడంతో బాచారం గ్రామంలో విషాదం నెలకొంది. గురువారం నలుగురి అంత్యక్రియలు జరిగాయి.



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



మృతదేహాలకు అంత్యక్రియలకు తరలిస్తున్న బంధువు

చెదిరిన పెళ్లి కళ.. శోఖ సంద్రంలో బాచారం

పెళ్లి జరగాల్సిన ఇల్లు శోఖ సంద్రంలో మునిగిపోయింది. పెళ్లిబాజాలతో కళకళలాడాల్సిన ఇల్లు రోదనలతో నిండిపోయింది. 12 గంటల వ్యవధిలో ఒకే గ్రామంలో.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాతపడడంతో ఊరంతా శోఖసంద్రంగా మారిపోయింది. మరణించిన రావు గారి బూదమ్మ, రావుగారి ఆగమ్మ ఇద్దరూ తోడికోడళ్లు. సొంత అక్కాచెల్లెళ్ల వలె కలిసిమెలిసి ఉండేవారు. అదే అనుబంధంతో బుధవారం పెళ్లికూతురుని తెచ్చేందుకు వెళ్తూ మృత్యువాతపడ్డారు. వారికి.. వరుసకు మామ అయ్యే పెంటయ్య మృతదేహానికి ఓకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమయాత్రకు మృతుల బంధువులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మృతుల కుటుంబాలను కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు.

సరిహద్దుల్లో నిఘా

- సంగారెడ్డి జిల్లాలో తొమ్మిది చెక్‌పోస్టులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 28 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో తొమ్మిది ప్రాంతాలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇరవై నాలుగు గంటలు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల సిబ్బంది కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూలు వెలువడినప్పటి నుంచి కోడ్ అమలులోకి రావడంతో ప్రజలు కూడా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా డబ్బులు, మద్యం తరలించే వారు చెక్‌పోస్టుల కంట పడకుండా ఇతర మార్గాల్లో జిల్లాలోకి వస్తున్నట్టు తెలుస్తున్నది. అందువల్లే చెక్‌పోస్టులు ఏర్పాటైన 10 రోజుల్లో ఇప్పటివరకు రూ.9.45 లక్షల నగదును సీజ్ చేశారు. అలాగే రూ.3,900 విలువైన 6.6.లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు.

తొమ్మిది ప్రాంతాల్లో చెక్‌పోస్టులు

కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లోని మొగుడంపల్లి మండలం మాడ్గి, గౌసాబాద్, న్యాల్‌కల్ మండలం హుగ్గెల్లి, మాల్గి, కోహీర్ శివారులోని మనియార్‌పల్లి, సిర్గాపూర్ తండా, నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాపూర్ చౌరస్తాతో పాటు కంగ్టి మండలం కరస్‌గుత్తి, దెగుల్‌వాడిలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సిబ్బంది రెండు షిఫ్టులలో 24 గంటల పాటు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో షిఫ్టులో ఎస్‌ఐ నాయకత్వంలో ఒక ఏఎస్‌ఐ, ఒక సివిల్‌పోలీస్ కానిస్టేబుల్, ఒకరు ఎక్సైజ్ కానిస్టేబుల్, రెవెన్యూ సిబ్బంది ఒకరు ఉంటున్నారు. వీరితో పాటు ప్రతిరోజు సాయంత్రం నుంచి ఉదయం వరకు నలుగురు చొప్పున సాయుధ పోలీసు బలగాలు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి.

ఇతర ప్రాంతాల్లోనూ ఆకస్మిక తనిఖీలు

జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లోనూ పోలీసులు ఆకస్మిక తనిఖీలు జరుపుతున్నారు. సంగారెడ్డితో పాటు ఇతర పట్టణాల్లో ప్రధాన రహదారులపై పోలీసులు తనిఖీలు జరుపుతున్నారు. దీంతో, రూ.50వేలకు పైగా నగదు తీసుకెళ్లాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తగు ఆధారాలు లేకుంటే నిబంధనలకు మించి డబ్బులు తరలించవద్దని పోలీసువర్గాలు కోరుతున్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

మహిళలు ఖాళీ బిందెలతో కనిపిస్తే అధికారులపై చర్యలు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 28: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరాపై అధికారులతో నిర్వహించిన గూగుల్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. వేసవి ప్రారంభమైన దృష్ట్యా నీటి ఎద్దడి ఉన్నా గ్రామాలన ముందస్తుగా గుర్తించి ప్రణాళిక ప్రకారం మిషన్‌భగీరథ నీరు క్రమతప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. గతేడాది నీటి సమస్య ఎదుర్కొన్న గ్రామాల్లో సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈలు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న నీటి పంపులు, బోరుబావుల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలన్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద తాగునీటి సరఫరా కోసం చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ గ్రామం, పట్టణం, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో తాగునీటి సరఫరా ప్రణాళికలు రూపొందించుకొని, నీటి లీకేజీలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలన్నారు. నీటి సరఫరాలో సమస్య తలెత్తితే సకాలంలో స్పందించి వాటని త్వరగా పరిష్కరించేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, సంబంధిత అధికారులు, ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, మిషన్‌భగీరథ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలయ్యే వరకు ప్రజావాణి రద్దు

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకోండి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 28 : లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో ఎస్పీ రూపేష్‌తో కలిసి గురువారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛాయుత వాతావరణలో ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని, తనిఖీల్లో పట్టుబడిన నగదుకు రశీదు ఇచ్చి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అందజేయాలని నిర్దేశించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఖర్చు రూ.90 లక్షలు దాటొద్దని, అభ్యర్థుల ఖర్చులను ఎఫ్ఎస్‌టీ టీములు పకడ్బందీగా రికార్డు చేయాలని సూచించారు. సీ-విజిల్ యాప్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ నగదు తరలింపుపై దృష్టిసారించాలని, పట్టుబడితే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. ప్రచార వాహనాల అనుమతి పత్రాలను, నంబర్లు పరిశీలించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీఎస్వో శ్రీధర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్

ఎన్నికల నియమావళికి కట్టుబడి నడుచుకోవాలి : ఎస్పీ

జహీరాబాద్, మార్చి 28 : జిల్లా ప్రజలు ఎన్నికల నియమావళికి కట్టుబడి నడుచుకోవాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలో గురువారం ఆయన డివిజన్ పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని పోలీస్‌స్టేషన్లలో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో పాత నేరస్థులపై నిఘా ఉంచాలని, అవసరమైతే బైండోవర్ చేయాలని నిర్దేశించారు. హైవేలు, ప్రధాన కూడళ్లు, పార్కింగ్ స్థలాలు, పెట్రోల్‌పంపులు, హోటళ్లలో సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ఎస్‌హెచ్‌వోలు అవగాహన కల్పించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐలు రాజబోయిన రవి, నయిమొద్దీన్, పట్టణ ఎస్ఐ లక్ష్మారెడ్డి, జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ప్రసాద్, ఆయా మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

బెల్టు షాప్‌పై దాడి.. కేసు నమోదు

గజ్వేల్, మార్చి 28: గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామంలో నడుపుతున్న బెల్ట్‌షాపులపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన కోడూరి పద్మ, కోడూరి రమేశ్ అక్రమంగా నిలువ ఉంచిన 31.015 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అనుమతి లేకుండా బెల్టు షాపులను నడపవద్దని హెచ్చరించారు.

వ్యసనాలకు బానిసలు కావొద్దు : సీఐ బి.సైదా



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ బి.సైదా

గజ్వేల్, మార్చి 28: విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కావొద్దని గజ్వేల్ సీఐ బి.సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గురువారం చట్టాలు, బాల్యవివాహాలు, సైబర్‌నేరాలు, గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఏకాగ్రతతో చదువుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే స్పందించవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో హాస్టల్‌వార్డెన్ లక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ సంజీవరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మార్పీఎస్(ఎంపీఎస్) రాష్ట్ర కార్యదర్శి నియామకం

రాయపోల్, మార్చి 28: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్, ఎంపీఎస్) రాష్ట్ర కార్యదర్శిగా రాయపోల్ మండలం కొత్తపల్లికి చెందిన పుర్ర నర్సింలును నియమించారు. ఈ మేరకు గురువారం ఆయనకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్) జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎన్ రమేశ్‌కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. మాదిగలకు 12శాతం రిజర్వేషన్, ఏబీసీడీల వర్గీకరణ సాధనకు నిరంతరం పోరాడాలని ఆయన సూచించారు. పుర్ర నర్సింలు మాట్లాడుతూ.. తనకు బాధ్యతలు అప్పగించిన జాతీయాధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చేనేత విగ్రహ ఆవిష్కరణ



చేనేత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్, మార్చి 28: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్ ఆర్ కాలనీ వేములఘాట్‌లో గురువారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో, చేనేత విగ్రహాన్ని సిద్దిపేట జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీష్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు తలకొక్కుల దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చేనేత విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయం తర్వాత చేనేత వృత్తికి విశేష ప్రాధాన్యత ఉందని తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు గాడిపల్లి శ్రీనివాస్, పద్మశాలి యువజన అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్, నాయకుడు నాగరాజు నేత, ఎల్లం రాజు, లక్ష్మణ్, సత్యనారాయణ, తుమ్మ నర్సింలు గాడిపల్లి బలరాం, హనుమాన్‌దాస్, విలాస్, వెంకటేష్, తిరుపతి పద్మశాలి సంఘం నాయకులు ఉన్నారు.

టికెట్ కేటాయించడం హర్షణీయం

దుబ్బాక, మార్చి 28: బీసీ బిడ్డ నీలం మధును కాంగ్రెస్ పార్టీ మెదక్‌పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడం హర్షణీయమని ఆపార్టీ దుబ్బాక మండల అధ్యక్షుడు కొంగరి రవి అన్నారు. నీలం మధుకు టికెట్ కేటాయించడంతో గురువారం దుబ్బాక బస్టాండ్ వద్ద సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా టపాసులను పేల్చి, మిఠాయిలను పంచుకున్నారు. కాంగ్రెస్‌పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను అధిష్ఠానం గుర్తిస్తున్నదని తెలిపారు. అందులో భాగంగానే బీసీలకు మెదక్‌పార్లమెంట్ స్థానాన్ని కేటాయించడం హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వనరేష్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు అనంతుల శ్రీనివాస్, ఎసురెడ్డి, మచ్చశ్రీనివాస్, నరేందర్, భరత్, చంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

బ్రహ్మోత్సవ శోభ

- రేపటి నుంచి బొంతపల్లి వీరన్న ఆలయంలో ఉత్సవాలు
- ఏర్పాట్లలో అధికారులు
- మూడు రాష్ట్రాల్లో ప్రసిద్ధి

గుమ్మడిదల, మార్చి 28 : భక్తుల కొంగుబంగారమైన బొంతపల్లి వీరన్న గూడెం వీరభద్ర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్నది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి వచ్చే నెల 7 వరకు కొనసాగనున్నాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలను తిలకించేందుకు రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు.

500 ఏళ్ల చరిత్ర

హైదరాబాద్ నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో మెదక్ హైవేకు సమీపంలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయానికి 5 శతాబ్దాల చరిత్ర ఉంది. కాకతీయ కాలంలో ఈ ఆలయం నిర్మితమైనట్టు చిత్రకారులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు దట్టమైన అరణ్యంగా ఉన్న ఈ ప్రాంతంలో స్వామివారు పాముల పుట్టలో స్వయంభువుగా వెలిసినట్టు చెప్పుకుంటారు. స్వామివారు భక్తులకు కలలో కనిపించి ఆనవాళ్లు చెప్పడంతో అప్పటి పాలకులు, వ్యాపారులు అదే ప్రాంతంలో భారీ ఆలయాన్ని నిర్మించారు. తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలో భక్తులు ఇక్కడి స్వామిని ఇలవేల్పుగా కొలుస్తారు. వారంతా శుభకార్యాలు, వివాహాలు జరుపుకునే ముందు స్వామివారికి ప్రత్యేక పూజలు, వీరభద్ర ప్రస్తాయం నిర్వహించడం ఆనవాయితీ. స్వామివారి సన్నిధిలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తుంటారు. శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయాన్ని ప్రస్తుతం విస్తరిస్తున్నారు. ఈక్రమంలో నాలుగు వైపులా ప్రాకారాలు, సత్రాలు నిర్మిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని కోనేటిని పునరుద్ధరించారు. ఇందుకోసం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గటాటి భద్రప్ప, పాలక మండలి సభ్యులు కృషి చేశారు.




భద్రకాళీ అమ్మవారు, వీరభద్రస్వామి వారి విగ్రహాలు



వీరభద్రస్వామి దేవాలయం

బ్రహ్మోత్సవాల వివరాలు

వీరభద్రస్వామి ఆలయంలో నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30న ప్రారంభమవుతాయి. శనివారం ఉదయం సుప్రభాతం, బిందె తీర్థం, బాలభోగము, గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి నందివాహన సేవ నిర్వహిస్తారు. 31న అశ్వవాహన సేవ, 1న హంసవాహన సేవ, 2న బృంగీశ్వర వాహన సేవ, 3న పొన్నవాహన సేవ, అగ్నిగుండాలు తొక్కడం ఉంటుంది. 4న కల్యాణోత్సవం, 5న రథోత్సవం, 6న దోపుసేవ, మిరిమిడి, పూర్ణాహుతి, రాత్రి నాకబలి నిర్వహిస్తారు. 7న ఏకాంత సేవ, డోలోత్సవం, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు: ఈవో

బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో శశిధర్‌గుప్తా తెలిపారు. ఉత్సవాలకు మూడు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారని చెప్పారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వసతులు కల్పిస్తున్నామన్నారు. వేసవి తీవ్ర దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేయిస్తున్నట్టు వెల్లడించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన దుర్గాభవాని క్షేత్రం

- ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో నేటి నుంచి మూడు రోజులు వేడుకలు
- 31న లక్ష దీపోత్సవానికి ఏర్పాట్లు

సంగారెడ్డి రూరల్, మార్చి 20 : సంగారెడ్డికి మండల పరిధిలోని ఈశ్వరాపురం (ఇస్మాయిల్‌ఖాన్ పేట) గ్రామంలో వెలసిన సప్త ప్రాకారయుత శ్రీదుర్గా భవాని మహాక్షేత్రం వార్షికోత్సవాలు నేటి నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా ఆలయంలో లక్ష దీపోత్సవం, శతచండీ యాగం, సహస్ర చండీ మహాయాగం, ఆయుత చండీ మహాయాగం, కోటి కుంకుమార్చన, శతరుద్ర, మహారుద్ర యాగాలు, చరుద్వేద పారాయణం నిర్వహించనున్నట్టు ధర్మాధికారి రాధాకృష్ణమూర్తి తెలిపారు.



సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని దుర్గాభవాని మహాక్షేత్రం

ఉత్సవాల వివరాలు

ఉత్సవాలు శుక్రవారం ఉదయం మహాగణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభవుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. రేపు ఉదయం నుంచి మహాయాగ నిర్వహణ, లక్ష పుష్పార్చన, రాత్రి 7 గంటలకు అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు యాగాలు, కుంకుమార్చన, సాయంత్రం లక్ష దీపోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లాతో పాటు హైదరాబాద్ నుంచి, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు.

వైభవంగా చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

వర్గల్, మార్చి 28: సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యాధరి క్షేత్రంలో చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో, గురుమదనానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతీ చేతుల మీదు ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఆలయంలో వేద పండితులు యాగశాల ప్రవేశం, స్థాపిత దేవతాపూజలు, గర్తన్యాసం, యంత్ర మూర్తి ప్రతిష్ఠ, తదుపరి కళాన్యాసం, ప్రాణ ప్రతిష్ఠ, బలి ప్రదానం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ దాతలు అనిల్ గుప్తా, అర్చనగుప్తా దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. వేడుకలకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో సంతాన మల్లిఖార్జున క్షేత్ర వ్యవస్థాపకుడు చెప్పెల హరినాథ్‌శర్మ, అలయ కమిటీ సభ్యులు బ్రహ్మశ్రీ యాయవరం రాజశేఖరశర్మ, దాచేపల్లి వెంకటకృష్ణ, సత్యనారాయణ, ఇర్రి మల్లారెడ్డి, బెజగాం వాసు గుప్తా, గంగిశెట్టి సుధాకర్‌గుప్త, ఆలయ వేద పండితులు గుండేశ్వరశర్మ, నాగరాజు శర్మ పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ్రాపతిష్ఠాపన



హనుమాన్ ఆలయంలో పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

సదాశివపేట, మార్చి 28: పట్టణంలోని 6వ వార్డు కృష్ణనగర్ కాలనీలో నిర్మించిన పంచముఖ హనుమాన్ మందిరంలో ఆంజనేయ, గణపతి, శివలింగం, నంది, నవగ్రహ, నాగదేవత, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం వైభవంగా ప్రారంభించారు. వేదపండితుడు విఘ్నేశ్వరపూజ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు నెమలికొండ వేణుమాధవ్ ఆలయ అభివృద్ధికి రూ.1,10,000 విరాళంగా అందజేశారు. ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగుల విజయ్‌కుమార్, కౌన్సిలర్ గుండు రవి, ఆలయ కమిటీ సభ్యులు దోమకొండ నరేష్‌కుమార్, మంబిగారి ఆంజనేయులు, ఆటిపాముల నందు, కొత్త రమేష్, బామిని రవి, కళ్యాణ్ రాజు, గురుగుల నాగరాజు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ వేడుకలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న పురోహితులు

సంగారెడ్డి రూరల్, మార్చి 28: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ పున ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. అరుణ్ గురుస్వామి చేతుల మీదుగా అయ్యప్ప స్వామివారికి కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు జయప్రకాష్, రాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, కోశాధికారి సాగర్, ఉపాధ్యక్షుడు శేషగిరి, సహాయ కార్యదర్శి గోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి అరుణ్, కమిటీ సభ్యులు ప్రసాద్, వీరకుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బస్సుల్లో నగలు కాజేసే పార్థీ గ్యాంగ్ అరెస్ట్

- 12.5 తులాల బంగారం రికవరీ
- ఐదుగురు సహా కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

తూప్రాన్, మార్చి 28: బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీ ప్రదేశాల్లో చోరీలకు పాల్పడే ఐదుగురు సభ్యుల మహారాష్ట్ర పార్థీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 12.5 తులాల బంగారు ఆభరణాలు, చోరీకి ఉపయోగించిన కారు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తుప్రాన్ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి గురువారం నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్‌లో నివాసముండే మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణానికి చెందిన ఉప్పల శ్వేత గత నెల 27న హైదరాబాద్ వెళ్లేందుకు తూప్రాన్ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు ఎక్కుతుండగా, ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోని 12.5 తులాల బంగారు నగలు చోరీ జరిగాయి. దీంతో తుప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి, నిందితులు కారులో పరారైనట్లు గుర్తించారు. కారు నంబర్ (ఎంహెచ్ 23 బీహెచ్ 1608) ఆధారంగా నిందితుల కోసం వేట సాగించారు. అయితే, అదే కారులో బంగారం అమ్మేందుకు వెళ్తుండగా దాబా హోటల్ వద్ద వారిని పట్టుకున్నారు. కారులో మహారాష్ట్ర పార్థీ ముఠాకు చెందిన వైశాలి విజయ్ సోలంకే (49), అతడి భార్య విజయ్ బీంరావు సోలంకే (39), హినా కరణ్ రహడే (21), ఈమె భర్త కరణ్ సంతోష్ రహడే (24), జయశ్రీ అంకుష్ సోలంకే (32)లు ఉండగా అరెస్ట్ చేశారు. వారిని విచారించగా, తూప్రాన్ బస్టాండ్‌లో చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి చోరీ చేసిన బంగారాన్ని రికవరీ చేశారు. అలాగే, కారు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వైశాలి విజయ్, అతని భార్య విజయ్ బీంరావులు గతంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట, షాద్‌నగర్, తిరుమల లలో చోరీలకు పాల్పడ్డారని, 2019 నుంచి వారిపై కేసులు ఉన్నాయని ఎస్పీ వివరించారు. చోరీ కేసును ఛేదించిన తూప్రాన్ డీఎస్పీ సోమ వెంకట్‌రెడ్డి, సీఐ రెడ్డబోయిన కృష్ణ, ఎస్ఐ శివానందం, సిబ్బందిని అభినందించారు. కానిస్టేబుళ్లు గోవర్ధన్, నాగేంద్ర బాబు, వెంకట్ లను అభినందిస్తూ వారికి నగదు రివార్డును ఎస్పీ బాలస్వామి అందజేశారు.



పార్థీ ముఠాను చూపుతున్న పోలీసులు

డబ్బు సంచులతోనే వెంకట్రామారెడ్డికి బీఆర్ఎస్ టికెట్

- అక్రమ సంపాదనతో వంద కోట్లకు ఎకరం కొనుగోలు
- ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ గెలుపు ఖాయం
- మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

నారాయణరావుపేట, మార్చి 28: అక్రమంగా సంపాదించిన డబ్బు సంచులతోనే మాజీ కలెక్టర్ వెంకట్రామారెడ్డి బీఆర్ఎస్ టికెట్ కొనుక్కున్నాడని మాజీ ఎమ్మెల్యే, మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. గురువారం సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రఘునంధన్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎమ్మెల్యేలు పార్టీ మారకుండా తలా రూ.పది కోట్లు ఇచ్చి పార్టీ మారకుండా ఆపారని ఆరోపించారు. వెంకట్రామారెడ్డి అక్రమ సంపాదనతో ఎకరం భూమిని రూ.వంద కోట్లకు కొన్నాడని ఆరోపించారు. ఎవరూ ఎన్ని కుట్రలు చేసినా మెదక్ పార్లమెంట్‌ను బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. తాను దుబ్బాక ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు అవమానించారని నేడు సిద్దిపేటలో బీఆర్ఎస్ కార్యకర్తలకు అదే అవమానం జరుగుతుందని చెప్పారు. బీజేపీ కార్యకర్తలందరూ బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేయాలని సూచించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బీజేపీకి మద్దతు తెలపడం అభినందనీయమని రఘునందన్‌రావు అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దినేష్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పవణ్‌కల్యాణ్, నాయకులు నర్సాగౌడ్, నాయకుల రమేష్‌గౌడ్, శీకాంత్, బాబు పాల్గొన్నారు.



నారాయణరావుపేటలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతునప్న రఘునంధన్‌రావు

కార్యాలయాలు తెరుచుకోవా?

- రెండు రోజులుగా మూసిఉన్న డీఎల్పీవో, ఏపీడీ ఆఫీసులు




గజ్వేల్ పట్టణంలోని డీఎల్పీవో, ఏపీడీ కార్యాలయాలకు తాళాలు వేసి ఉన్న దృశ్యం

గజ్వేల్, మార్చి 28: సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో గల పలు కార్యాలయాలు తెరచుకోవడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమో.. విధుల పట్ల నిర్లక్ష్యమో తెలియదు కానీ ఎప్పుడు చూసినా కార్యాలయాలకు తాళాలు వేసి ఉంటున్నాయి. గజ్వేల్ డివిజన్‌గా అవతరించిన అనంతరం గజ్వేల్‌కు పలు డివిజన్ కార్యాలయాలు మంజూరవగా గజ్వేల్ పట్టణంలోని సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవనంలో కార్యాలయాలు కేటాయించారు. సదరు కార్యాలయాలకు సరిపడా నియమకాలను చేపట్టకపోవడంతో డివిజన్ స్థాయి అధికారులే తాళం తీసుకుని వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కోవలోకే గజ్వేల్ పట్టణంలో డీఎల్‌పీవో, ఏపీడీ, పంచాయతీరాజ్ క్యూసీ, ఎస్సీడబ్ల్యూవో కార్యాలయాలు ఉన్నాయి. గడిచిన రెండు రోజులుగా ఈ కార్యాలయాలు మూసి ఉండడం గమనార్హం.

సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



కొల్చారంలోని మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం, మార్చి 28: మిల్లర్లు సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. కొల్చారం మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి పారా బాయిల్డ్ రైస్‌మిల్, శ్రీ శ్రీధర్ రైస్‌మిల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. రైస్ మిల్‌లో బియ్యాన్ని పరిశీలించారు. బియ్యం డెలివరీ, యాసంగి, రబీ 2022-23 సంబంధించిన బియ్యం అప్పగించాలని, వానాకాలం సీజన్‌కు టెండర్ పూర్తి అయిన ధాన్యం వెంటనే అప్పగించాలని మిల్లర్లకు సూచించారు. జిల్లాలో పౌరసరఫరాల శాఖ పనితీరు ఆదర్శనీయంగా ఉండాలన్నారు. 2021-22 రబీ, 2021-22 ఖరీఫ్ ధాన్యం బియ్యం అప్పగింతలు పెండింగ్‌లో ఉన్న మిల్లర్లు ఈ సంవత్సరం ఏప్రిల్ 30లోగా డెలివరీ పూర్తి చేయాలని, పూర్తి చేయకుంటే మిల్లర్లపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ హరికిష్ణ, మిల్లుల యజమానులు శ్రీనివాస్, ఆశ్నగారి కిష్టయ్య, ప్రభాకర్, ప్రణీత, సాధిక్ తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్లను సందర్శించిన సిద్దిపేట సీపీ



చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

చేర్యాల/మద్దూరు, మార్చి 28: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేట సీపీ అనురాధ గురువారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి విధుల నిర్వహణ, శాంతిభద్రతల పర్యవేక్షణ తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలను గుర్తించి ముందస్తు చర్యలతో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బైండోవర్ కేసులు, ప్రైవేట్ గన్ డిపాజిట్, ఫ్లాగ్‌మార్చ్ తదితర వివరాలపై ఆరా తీశారు. ఎన్నికల వేళ పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రజల్లో నమ్మకం, ధైర్యాన్ని పెంపొందివజేస్తూ ధైర్యంగా ఓటువేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత నేరస్తులు, గత ఎన్నికల్లో నేరాలు చేసిన వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లను మభ్యపెట్టే వారిపై నిఘాపెట్టాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఆమెవెంట హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ దామోదర్, నాగరాజు, మద్దూరు ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ, ఏఎస్ఐ జగదీశ్వర్, విజయ్‌కుమార్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

బైక్‌ను లారీ ఢీకొని యువకుడి మృతి

సదాశివపేట, మార్చి 28: బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలోని 65వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్టూర్ గ్రామానికి చెందిన సంగమేశ్వర్(20) గురువారం సాయంత్రం 7గంటల సమయంలో నిజాంపూర్ వైపు నుంచి సదాశివపేటకు బైక్‌పై వెళ్తున్నాడు. బైపాస్ రోడ్డును దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న ఓ లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంగమేశ్వర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ మహేష్ తెలిపారు.

50 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించాలి

- జహీరాబాద్‌లో సీఐటీయూ నాయకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

జహీరాబాద్, మార్చి 28: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం అంతకంతకు విస్తరించడంతోపాటు పరిశ్రమలు కూడా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కార్మికుల ఇబ్బందులను గుర్తించి పట్టణంలో 50పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మహిపాల్ కోరారు. గురువారం పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రివద్ద సీఐటీయూ నాయకులు, కార్మికుల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ పట్టణంలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటుచేయాలని అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 30వేల మంది పైచిలుకు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. స్థానికంగా ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణంపై దృష్టిపెట్టకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. కార్మికుల ఇబ్బందులను గుర్తించి జహీరాబాద్‌లో 50పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

స్కూళ్లు.. కమ్యూనిటీ హాళ్లు

ఇవే జీపీ కార్యాలయాలు

కొత్త పంచాయతీలకు పక్కా భవనాలు కరువు

జహీరాబాద్, మార్చి 28: అభివృద్ధికి పట్టుకొమ్మలుగా చెప్పుకునే గ్రామ పంచాయతీలను ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం వాటి నిర్వహణ సంగతి పక్కన పెడితే.. పక్కా భవనాలు ఏర్పాటు దిశగా ఏ మాత్రం శ్రద్ధ చూపలేదు. దీంతో గ్రామాల్లోని పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామ పంచాయతీ పాలనా కేంద్రాలుగా మారాయి. పాలనా సౌలభ్యం కోసం 2018లో గత ప్రభుత్వం ప్రతీ 500 జనాభా ఉన్న ప్రతి గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఒక్క జహీరాబాద్ నియోజకవర్గంలోనే కొత్తగా ఏర్పాటైన 25 గ్రామపంచాయతీలతో కలిపి, 135పై చిలుకు గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో చాలా గ్రామపంచాయితీలకు పక్కా భవనాలు లేవు. పాఠశాలల్లో, కమ్యూనిటీ హాళ్లలో కొత్తగా ఏర్పాటైన పంచాయతీల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాలను పంచాయతీ భవనాలుగా ఏర్పాటు చేశారు. అలాగే, వివిధ కమ్యూనిటీల వారి అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీ భవనాల్లోనూ గ్రామపంచాయతీ పాలకవర్గం కొలువుదీరింది. కొన్ని గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. నిధులు లేకపోవడం, స్థల సమస్యతో ముందడుగు పడలేదు.



హుగ్గెల్లి తండాలో పాఠశాల భవనంలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయం



అర్జున్‌నాయక్‌తండాలో కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయం



మధులై తండాలో అంగన్‌వాడి కేంద్రంలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయం

సొంత భవనం లేక ఇబ్బందులు



గత ప్రభుత్వం తండాను గ్రామపంచాయతీగా మార్చినప్పటికీ సొంత భవనం లేకపోడంతో ప్రజలతో పాటు అధికారులూ ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణ పనులు చేపట్టినా.. ఏడాదిగా అవి నత్తనడకన సాగుతున్నాయి. వెంటనే పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

\- భీంరావ్ రాథోడ్, హుగ్గెల్లితండా

కలుషితమవుతున్నా పట్టించుకోరా?



టి లింగంపల్లిలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలి మురుగు నీటితో కలిసిపోయిన దృశ్యం

రేగోడు, మార్చి 28: పైపులైన్ లీకై తాగునీరు కలుషితమవుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ పథకం ద్వారా మండలంలోని తాటిపల్లి వాటర్ ట్యాంక్ నుంచి గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతున్నాయి. టి లింగంపల్లి గ్రామం వద్ద పైపులైన్ పగిలి మురుగు నీటితో కలిసిపోతున్నది. దీంతో టి లింగంపల్లితో పాటు ప్యారారం, పోచారం, మర్పల్లి, రేగోడు, చౌదరిపల్లి, కొండాపూర్, జగిర్యాల గ్రామాలకు కలుషిత తాగునీరు సరఫరా అవుతున్నది. మూడు నెలలుగా పైపులైన్ లీకవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ నాయకుల డిమాండ్

నారాయణఖేడ్, మార్చి 28: ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు మాణిక్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికులతో కలిసి ఖేడ్ ఏరియా వైద్యశాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లిస్తూ, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సతీష్, పవన్, కార్మికులు పాల్గొన్నారు. కాగా సీఐటీయూ అనుబంధ ఏరియా వైద్యశాల కాంట్రాక్టు కార్మికుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మాణిక్, అధ్యక్షుడిగా సతీష్, ఉపాధ్యక్షులుగా అడివమ్మ, బాలమణి, ప్రధాన కార్యదర్శిగా రేవతి, సహాయ కార్యదర్శులుగా లక్ష్మి, విక్టోరియా, కార్యవర్గ సభ్యులుగా అర్జున్, బాలన్న, కవిత, ఎలిషా, లక్ష్మి ఎన్నికయ్యారు.



కోహీర్‌లో డాక్టర్ అఖిల్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది



ఖేడ్ ఏరియా ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు

కోహీర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో..

కోహీర్: ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరుతూ గురువారం కోహీర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది యునైటెడ్ అండ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డాక్టర్ అఖిల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ప్రతినెల వేతనాలు అందడంలేదని వాపోయారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని, వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు సిబ్బంది మనయ్య, దుర్గయ్య, లక్ష్మి, ఈశ్వరమ్మ, పూలమ్మ, తుల్జమ్మ, రషీద్, పుష్ప పాల్గొన్నారు.

మూడు బార్ అసోసియేషన్ల ఎన్నిక

● మెదక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుభాష్‌చంద్రగౌడ్



నియామక పత్రాన్ని అందుకుంటున్న సుభాష్‌చంద్రగౌడ్

మెదక్ అర్బన్, మార్చి 28: మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కొండన్ సుభాష్ చంద్రగౌడ్ ఎన్నికయ్యారు. ఏడాది పాటు కొనసాగనున్న అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు ఎన్నికల అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు ప్రాంగణంలో జరిగాయి. అధ్యక్షుడిగా సుభాష్ చంద్రగౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీపతిరావు, ఉపాధ్యక్షులుగా ఆకుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా దుర్గారెడ్డి, లైబ్రరీ కార్యదర్శిగా అశ్వనికుమార్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా మధుకిరణ్, కార్యవర్గ సభ్యులుగా పరశురాములు, శారద, రమేష్‌నాయక్, చిరంజీవి, బేగ్ ఎన్నికయ్యారు. ఎన్నికల సహాయ అధికారులుగా సాయికుమార్, లక్ష్మణ్‌గౌడ్, మంజుల వ్యవహరించారు.

ఖేడ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నర్సారెడ్డి



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న న్యాయవాదులు

నారాయణఖేడ్: తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు గురువారం ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుమ్మడి నర్సారెడ్డి, ఉపాధ్యక్షులుగా పోతుల సుధాకర్, ప్రధానకార్యదర్శిగా లక్ష్మణ్‌రావు, సహాయ కార్యదర్శులుగా అలిగే జీవన్‌కుమార్, కోశాధికారిగా పి.నర్సింహారావు, కార్యవర్గ సభ్యులుగా ఆనంద్‌స్వరూప్ షెట్కార్, మారుతిరెడ్డి, బోజిరెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా చంద్రశేఖర్‌రావు వ్యవహరించారు. కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

జహీరాబాద్ అధ్యక్షుడిగా ఇప్పెపల్లి గోపాల్



జహీరాబాద్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

జహీరాబాద్, మార్చి 28: జహీరాబాద్ బార్‌అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఎన్నికల అధికారి చంద్రశేఖర్‌పాటిల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఇప్పెపల్లి గోపాల్, ఉపాధ్యక్షుడిగా మాణిక్‌పాటిల్, ప్రధాన కార్యదర్శిగా గోపాలక్రిష్ణ, కోశాధికారిగా గోపాల్‌ముదిరాజ్, సంయుక్త కార్యదర్శిగా సోమశేఖర్, గ్రంథాలయ కార్యదర్శిగా కార్తీక్‌గౌడ్, సభ్యులుగా అనుషమ్మ, బుజ్జిలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మహిళ అదృశ్యం

సంగారెడ్డి క్రైం, మార్చి 28: సంగారెడ్డి పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన కొండి సంతోష(42) ఈ నెల 26న భర్త కిషన్‌తో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయి, తిరిగి రాలేదని పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపారు. బంధువుల వద్ద, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఆమె భర్త కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఐదు ట్రాక్టర్ల స్వాధీనం

శివ్వంపేట, మార్చి 28: ప్రభుత్వ భూమి నుంచి మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం మండలంలోని గంగాయిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గంగాయిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూమి నుంచి మట్టిని తవ్వి తరలిస్తున్నట్లు గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెళ్లి ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

'వాయిస్ ఫర్ గర్ల్స్'కు అనూహ్య స్పందన

సంగారెడ్డి రూరల్, మార్చి 28: కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ బడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పది కేజీబీవీలో బాలికలకు వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమాన్ని నిర్వహించామని డీడబ్ల్యూవో లలితకుమారి గురువారం తెలిపారు. ఈ నెల 9నుంచి 28వరకు నిర్వహించిన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందని అన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు అవసరమయ్యే మెళకువలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో జీసీడీవో మాధవి, జిల్లా సమన్వయకర్త పల్లవి పాల్గొన్నారని తెలిపారు.

విద్యార్థిని సింధుకు అభినందన

సంగారెడ్డి అర్బన్, మార్చి 28: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎం.సింధును ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ రవీందర్ అభినందించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హరియాణలోని ఫరిదాబాద్‌లో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరంలో తెలంగాణ సాహిత్య, సంస్కృతీ, సంప్రదాయాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చినందుకుగాను సింధును అభినందించారు. అదే విధంగా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్‌తో పాటు అధ్యాపకులు సింధును ప్రత్యేకంగా అభినందించారు.

శాంతియుతంగా పండుగ జరుపుకోవాలి

మెదక్ అర్బన్, మార్చి 28: శాంతియుత వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలని మెదక్ డీఎస్పీ రాజేశ్వర్ సూచించారు. గురువారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో మత పెద్దలతో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో పండుగలు జరిగే విధంగా పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుటుందని, ప్రజలు సహకరించాలని కోరారు. సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

టికెట్ కేటాయింపుపై హర్షం

పాపన్నపేట, మార్చి 28: కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ టికెట్‌ను నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించడం పట్ల పాపన్నపేట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ముశెట్టి కిష్టయ్య ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. అట్టడుగు స్థాయి నుంచి, రాజకీయ నేపథ్యం లేకుండా స్వతహాగా ఎదిగిన నీలం మధుముదిరాజును కాంగ్రెస్ గుర్తించి టికెట్ ఇవ్వడం హర్షనీయమన్నారు.

ఉద్యోగాలు ఇస్తామంటూ మోసం..

● తహసీల్దార్‌కు ఫిర్యాదు

నర్సాపూర్, మార్చి 28: నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్ సమీపంలోని ఓ హ్యాచరీస్ సంస్థ ఎస్సీలకు చెందిన భూములను గతంలో తీసుకుంది. ఆ సమయంలో కంపెనీలో ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇంతవరకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నదని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బైలపాటి గణేష్ అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కమలాద్రికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థలో ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి కాగజ్‌మద్దూర్, రేండ్లగూడ గ్రామపరిధిలోని ఎస్సీల భూములను తీసుకున్న హ్యాచరీస్ సంస్థ యాజమాన్యం హామీ నెరవేర్చలేదన్నారు. అందుకు ఆ సంస్థపై చర్యలు తీసుకుని దళితులకు న్యాయం చేయాలని గణేష్ కోరారు.

వైరల్ ఫీవర్ బాధితులకు వైద్య పరీక్షలు

చిన్నశంకరంపేట, మార్చి 28: చిన్నశంకరంపేట మండలంలోని మదూర్ గ్రామంలో వైరల్ ఫీవర్‌తో ప్రజలు బాధపుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో గురువారం గ్రామంలో మండల వైద్యాధికారి సాయి సింధు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల నుంచి కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, వైరల్ ఫీవర్‌తో ప్రజలు బాధపడుతున్నట్లు తెలుసుకుని వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారి హారిక, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

చిలప్‌చెడ్, మార్చి 28: ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో ఆనంద్ సుచించారు. గురువారం మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో ఆనంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కూలీలకు తాగునీరు అందుబాటులో ఉంచాలని, సేద తీరేందుకు పని ప్రదేశంలో టెంటులను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పల్లె ప్రకృతివనం, నర్సరీలను పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా కాపాడాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తిరుపతి, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించం

● మెదక్ కాంగ్రెస్ నేతల హెచ్చరిక



మెదక్ క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

మెదక్, మార్చి 28: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. గురువారం మెదక్‌లోని క్యాంపు కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కొండన్‌సావిత్రి సురేందర్‌గౌడ్, న్యాయవాది జీవన్, బొజ్జ పవన్, గోదల క్రిష్ణ, పవన్, మున్నా మాట్లాడుతూ.. కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు ఎమ్మెల్యే రోహిత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం మాజీ మంత్రి హరీశ్‌రావు మెప్పు పొందడానికి ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. మైనంపల్లి కుటుంబంపై ఆధారాల్లేకుండా అభాండాలు వేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌కు అభ్యర్థి దొరకక కోట్లు కూడబెట్టిన వెంకట్రామారెడ్డికి మెదక్ లోక్‌సభ టికెట్ ఇచ్చారని విమర్శించారు. బీసీ అయిన నీలం మధుకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చి బీసీల పక్షపాతి అని తమ అధిష్ఠానం నిరూపించుకున్నదని చెప్పారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్



పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్

పెద్దశంకరంపేట, మార్చి 28: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, మిషన్‌భగీరథ వాటర్‌మెన్‌లకు తాగునీటి శాంపిళ్ల సేకరణపై అవగాహన కల్పించారు. ఆయా ట్యాంకుల నుంచి మూడు రకాలుగా శాంపిల్స్ సేకరించి, రికార్డుల్లో పొందుపర్చాలని సూచించారు. క్లోరినేషన్ తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసా, సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీలకు క్లోరోసిన్ పరికరాలను అందజేశారు. ఈ సమావేశంలో ఏఈ రమేష్, ల్యాబ్ సిబ్బంది రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

రేగోడు: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ భాస్కర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులకు, వాటర్ సప్లై సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో ట్యాంకులను శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ వాడడం, క్లోరినేషన్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సీతారావమ్మ, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోజురోజుకూ బలపడుతున్న కాంగ్రెస్

● నర్సాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జి రాజిరెడ్డి



రాయికోడ్ మండలం నాగ్వార్‌లో కాంగ్రెస్‌లో చేరిన పలు పార్టీల నాయకులు

నర్సాపూర్, మార్చి 28: రాష్ట్రంలో రోజురోజుకూ కాంగ్రెస్ పార్టీ బలపడుతున్నదని, నర్సాపూర్ నియోజకవర్గంలో మరింత పటిష్టమవుతున్నదని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నర్సాపూర్‌లో మాట్లాడుతూ.. త్వరలోనే ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పార్టీలో చేరనున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి పాలన పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా బీసీకి కేటాయించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు.

జహీరాబాద్ అభ్యర్థి గెలుపు ఖాయం

రాయికోడ్: లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజయ్య అన్నారు. గురువారం రాయికోడ్ మండలంలోని నాగ్వార్ గ్రామానికి చెందిన పలువురు అంజయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి దామోదర్ రాజనర్సింహ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అలిగే రవీందర్, పెద్దదొడ్డి ఏవన్, బ్యాగరీ లక్ష్మయ్య, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపునకు సహకరించాలి

● కాంగ్రెస్ నేతల మద్దతు కోరిన నీలం మధు



తూప్రాన్‌లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని కలిసిన నీలం మధు

నర్సాపూర్, మార్చి 28: కాంగ్రెస్ మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా ఖరారైన నీలం మధు గురువారం సాయంత్రం నర్సాపూర్‌లో నియోజకవర్గ ముఖ్య నాయకులను కలిశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో రాజిరెడ్డితో పాటు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పలువురు నాయకులను కలిశారు. తన గెలుపునకు సహకరించాలని వారిని మధు కోరారు. నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ వచ్చే విధంగా తమవంతు కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. మధు కలిసిన వారిలో నాయకులు శ్రీనివాస్‌గుప్తా, రవీందర్‌రెడ్డి, మల్లేశం, అంతారంసుధీర్‌రెడ్డి, మణిదీప్, అశోక్, వెంకటేశం, అశోక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

● తూప్రాన్: తూప్రాన్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిని నీలం మధు కలిసి, మద్దతు కోరారు. సమన్వయం కోసం త్వరంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. తూంకుంట నర్సారెడ్డితోపాటు, తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డిని సైతం కలిసి గెలుపునకు సహకరించాలని కోరారు.

చిరుత దాడిలో దూడ మృతి

రామాయంపేట, మార్చి 28: చిరుత దాడిలో దూడ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కాట్రియాల బాపనయ్య మోత్కుల తండాలో జరిగింది. తండా శివారులోని కొట్టంలో కట్టేసి ఉంచిన లేగదూడపై గురువారం తెల్లవారుజామున దాడి చేసి చంపేసింది. రైతు లంబాడి బీమ్లా సమాచారాన్ని అటవీ అధికారులకు అందించారు. అటవీ శాఖ అధికారులు, పోలీసలు అక్కడకు వెళ్లి వివరాలు సేకరించారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

మాసాయిపేట, మార్చి 28: మాసాయిపేట మండలం రామంతపూర్ తండా ప్రాథమిక పాఠశాలకు జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రింటర్‌ను బహూకరించారు. విద్యార్థుల సౌకర్యార్థమై ప్రింటర్‌ను అందజేసినట్లు జీఎంఆర్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు ఉదయశ్రీ, హిమబిందు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

● రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్

నర్సాపూర్, మార్చి 28: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా నాయకులు పనిచేయాలని, గ్రామగ్రామాన విస్తృతంగా పర్యటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా దేశాభివృద్ధికి పాటుపడుతూనే అవినీతి రహిత పాలన అందిస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో అమలుకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వందరోజుల పాలనపై ప్రజలు అసంతృప్తిలో ఉన్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభావం ఎన్నికల్లో ఉండదని చెప్పారు. మెదక్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ రమణారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, కౌన్సిలర్లు సురేష్, యాదగిరి, బుచ్చేస్‌యాదవ్, లతరమేష్‌యాదవ్, సీనియర్ నాయకుడు పెద్దరమేష్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, చంద్రయ్య, దేవేందర్, భరత్, రామిరెడ్డి పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న మురళీధర్‌యాదవ్

గిరిజన తండాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

నారాయణఖేడ్: గిరిజనుల తండాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఎస్టీ మోర్చా జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి అమర్‌సింగ్‌పవార్ అన్నారు. గురువారం ఖేడ్‌లో ఎస్టీ మోర్చా సన్నాహక సమావేశం, తండా దర్శన్ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నరేంద్రమోదీని మూడోసారి ప్రధాన మంత్రిగా గెలిపించడం చారిత్రాత్మక అవసరమన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న బీబీపాటిల్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంతోష్ రాథోడ్, ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం, మండలాల ఎస్టీ మోర్చా అధ్యక్షులు పవన్‌నాయక్, సురేష్‌నాయక్, శివాజీనాయక్, లక్ష్మణ్‌నాయక్, సుభాష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో మాట్లాడుతున్న ఎస్టీ మోర్చా నాయకులు

మోదీ హయాంలోనే అభివృద్ధి

జహీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశాభివృద్ధి జరుగుతుందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. బస్తీ పర్యటనలో భాగంగా గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఆయా వార్డుల్లో తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ గెలుపుకోసం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అరుణకౌశాస్, మఠం విశ్వనాథ్, శ్రీనివాస్‌గుప్త, సంతోస్‌పాలికర్, అప్పంశ్రవణ్, వెంకట్, రూషబ్‌వంశీ, చంద్రశేఖర్, అర్చనసారడా, శోభారాణీ తదితరులు పాల్గొన్నారు. కాగా చెంగిచెర్లలో మహిళలపై జరిగిన దాడులను నిరసిస్తూ జహీరాబాద్ బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ నరేష్‌పాటిల్ నేతృత్వంలో పట్టణంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు రుషబ్, అఖిలేష్, వంశీ, గురు, సంగమేష్, హరీష్ పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో కేంద్ర పథకాలపై ప్రచారం చేస్తున్న నాయకులు

దళితులపై దాడులు చేయడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు

నిజాంపేట, మార్చి 28: స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు గడుస్తున్నా గ్రామాల్లో నేటికీ కుల వివక్షతో దళితులపై దాడులు జరగడం బాధాకరమని టీఎస్ ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ అన్నారు. గురువారం నిజాంపేట మండల కేంద్రంలోని ఓ స్థల వివాదంలో మాజీ ఉపసర్పంచ్ కొమ్మట బాబును కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా కొమ్మాట బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల భూపాల్, రాష్ట్ర కార్యదర్శి ఎర్ర లింగం, సిద్ధిని రాజమల్లయ్య మెదక్ జిల్లా అధ్యక్షుడు పిట్ల రాములు, నాయకులు డప్పు శ్రీనివాస్, ఎల్లం పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టును సందర్శించిన ఎస్పీ



దామరచెరువు చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ చేస్తున్న ఎస్పీ బాలస్వామి

రామాయంపేట, మార్చి 28: మెదక్-కామారెడ్డి జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఎస్పీ బాలస్వామి గురువారం సందర్శించారు. రెండు జిల్లాల సరిహద్దు దామరచెరువు హైవేలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మెదక్ ఎస్పీ బాలస్వామి పరిశీలించి, రికార్డులు పరిశీలించారు. ఎప్పటికప్పుడు వాహనాలను తనిఖీ చేయాల్సిందిగా సిబ్బందికి సూచించారు.

వ్యభిచార గృహంపై దాడి.. ఐదుగురి అరెస్టు

సంగారెడ్డి క్రైం, మార్చి 28: సంగారెడ్డి పట్టణంలోని ఓ లాడ్జిలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపారు. పట్టణంలోని సాయిబాబా లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు గురువారం తనిఖీ చేసినట్లు తెలిపారు. లాడ్జి యజమాని సందీప్‌బాబు, మేనేజర్ లింగం, లాడ్జి పక్కనే ఉన్న మెకానిక్ నజీర్ అహ్మద్‌లతో పాటు ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో బాధితులైన మహిళలను న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిస్క్యూ హోంకు తరలించినట్లు తెలిపారు.

శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహావిష్కరణలో నాయకులు, పీఠాధిపతులు

రాయికోడ్, మార్చి 28: మండల పరిధిలోని పీపడ్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన శివాజీ మహరజ్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బర్దీపూర్ ఆశ్రమపీఠాధిపతి సిద్దేశ్వర్‌స్వామి, నాయకులు జి.అంజయ్య, బాలాజీనర్సింలు, సిద్ధన్నపాటిల్, బస్వరాజ్‌పాటిల్, సుభాషపాటిల్, కృష్ణ, నాగిశెట్టిపటేల్, దీపక్‌పటేల్, మారుతిరావు, అమృతరావు, బసలింగప్ప పాల్గొన్నారు.